**"సుందరం ఇంత పని చేస్తాడని కలలో కూడా అనుకోలేదు. సుందరం సరే కరుణ విషయంలో ఇలాంటిది ఊహించామా? నోట్లో నువ్వు గింజ నాన్చకుండా అమాయకంగా ఉండే సుందరం, చిన్నతనం నుండీ తను గీచిన గీత దాటని కరుణ వీళ్లిద్దరి కడుపులో ఇంతంత ఆలోచనలు దాగి ఉంటాయని ఏ మాత్రం ఊహించినా పరిస్థితి ఇలా చేయిదాటేది కాదు. అది సరే ఈ విషయం అనసూయమ్మత్తకు ఎలా చెప్పటం? చెట్టంత కొడుకుపోయి నిండా రెండు సంవత్సరాలైనా కాలేదు. కోడలు చేసిన ఈ పనిని ఆవిడ తట్టుకోగలదా?"**

'**టి**కెట్', 'టికెట్' కండక్టరు కేకతో ఈ లోకంలోకి వచ్చిన సూర్యం 'కోదాడకి ఒకటివ్వండి' అంటూ వంద రూపాయల నోటు అందించాడు. కండక్టరు ఇచ్చిన టికెట్టూ చిల్లరా జేబులో పెట్టుకు వెనక్కివాలిన సూర్యం గతంలోకి జారిపోయాడు.

☆ ☆ ☆

**ఒ**క ప్రభుత్వ కార్యాలయంలో యు.డి.సిగా పని చేస్తున్న సూర్యానికి అదే ఆఫీసులో కొత్తగా అపాయింట్ అయిన సుందరం పరిచయం అయ్యాడు. డిగ్రీలు, పోటీ పరీక్షలు ఫస్టు క్లాసులో పాసవడానికి లోకజ్ఞానానికి బొత్తిగా సంబంధం లేదని సుందరాన్ని చూస్తేగాని, సూర్యానికి తెలిసి రాలేదు. చదువులోనూ, పుస్తక పరిజ్ఞానంలోనూ ఇతర విషయాలలోనూ గొప్ప తెలివిగలవాడుగా ఉండే సుందరం చిన్న చిన్న లౌకిక వ్యవహారాలలో చేతకానివాడుగా కడపడేవాడు. దానితో రూమ్ వెతికి పెట్టడం, షాపింగ్ చేయడం లాంటి విషయాలలోనూ, ఆఫీసులో కో-వర్కర్లతో మెలిగే విధానం ఇతరత్రా లొసుగులు అర్థం చేసుకొనేందుకు సూర్యం సహాయం తప్పని సరి అయింది. ఆరు నెలలు తిరిగేసరికి వారు వీరు కాకపోయినా, సుందరం తెలివి తేటలు సూర్యాన్ని, సూర్యం వ్యవహార జ్ఞానం సుందరాన్ని బాగా ఆకర్షించాయి. అభిప్రాయాలు కూడా కలవడంతో వాళ్ళిద్దరూ మంచి స్నేహితులే అయ్యారు. చిన్నతనంలోనే తండ్రిని పోగొట్టుకొని కుటుంబ వ్యవహారాలు వంటపట్టించుకొని సూర్యం, మొన్ననే తల్లిదండ్రులిద్దరినీ అకస్మాత్తుగా పోగొట్టుకొని ఒంటరిగాడైన సుందరానికి మంచి ఓదార్పునివ్వగలిగాడు. వీటన్నిటి వల్ల సుందరం వసతి తాను ఉంటున్న రూమ్ నుండి సూర్యం ఇంట్లోకి మారిపోయింది. సూర్యం ఇంట్లోకి పేయింగ్ గెస్ట్‌గా వచ్చిన సుందరం త్వరలోనే వాళ్ళింట్లో అందరికీ తలలో నాలుకైపోయాడు. చిన్నతనం నుండీ అమ్మ కొంగుపట్టుకు తిరుగుతూ సంపాదించిన వంటింటి పరిజ్ఞానం ఈ విషయంలో సుందరానికి అక్కరకొచ్చింది. సుందరం పుస్తక పరిజ్ఞానం సూర్యం పిల్లలకు ఇక వేరే ట్యూషను అవసరం లేకుండా చేసింది.

ఇలా కథలలో చెప్పుకొన్నట్లు అంతా సుఖంగా సాగిపోతుండగా కథ అనుకోని మలుపు తిరిగింది. అదే సూర్యం చెల్లెలు కరుణ ప్రవేశం.

కరుణ గురించి చెప్పుకొనేందుకు పెద్ద ప్రత్యేకతలు ఏమీ లేవు. ఆమె ఒక సగటు మధ్య తరగతి ఆడపిల్ల. తండ్రి లేకపోయినా తల్లి ఆధ్వర్యంలో జరిగిన సంసారంలో తల్లి చెప్పిన ఇంటి పనులు చేయడం తప్ప ఆమెకు వేరే పాత్ర లేదు. నగరంలో పెరిగింది కనుక ఇంటర్ వరకూ చదువు మాత్రం పూర్తి చేసింది. ఇంటర్ పరీక్షలు రాసీ రాయగానే జరిగిపోయిన వివాహం విషయంలో కూడా ఆమె నిమిత్తమాత్రురాలే. చదువు సరిగ్గా

నండూరి వెంకట సుబ్బారావు

# చైతన్యం




అబ్బుక వ్యవసాయం చేస్తున్న బావతో వివాహం జరిపించాడు సూర్యం. మేనత్త అనసూయమ్మకు ఉన్న ఆస్తిపాస్తులు, అంతకన్నా ముఖ్యంగా భర్తపోయిన తర్వాత కూడా ఆస్తులను కంటికి రెప్పలా కాపాడుకొస్తున్న ఆమె సమర్థత మీద సూర్యానికి మంచి నమ్మకం ఉంది. అందుకే బావ సరిగ్గా చదువుకోకపోయినా ఒకటీ అరా వ్యసనాలకు లోనయ్యాడని ఆనోటా ఈ నోటా వినపడినా అనసూయమ్మగారు కొడుకును అదుపులో పెట్టుకోగలదనీ, కోడలికి ఏలోటూ రానీయదని నమ్మకంతో ఈ పెళ్ళి చేశాడు సూర్యం.

అన్నీ అనుకొన్నట్లు జరిగితే జీవితమే కాదు కనుక అనసూయమ్మగారి అబ్బాయి, సూర్యానికి బావ అయినటువంటి జీవి ఒక రోడ్డు ప్రమాదంలో మరణించాడు. పెళ్ళయి సంవత్సరం నిండీ నిండక ముందే కరుణ వితంతువయ్యింది. అయితే దీనివల్ల ఎవరి జీవితంలోనూ చెప్పుకోదగ్గ మార్పులేమీ సంభవించలేదు. అనసూయమ్మగారు మాత్రం తన తర్వాత వంశం నిలవకుండా పోయిందే అని విచారించారు.





అనసూయమ్మగారికి మొదటి నుండీ మేనకోడలంటే ప్రేమ ఆప్యాయతలు మెండు. చిన్నతనం నుండీ మేనకోడలు అంతా తన పోలికేననుకోవడం దీనికొక కారణం. అందుకే కోరి కోడల్ని కూడా చేసుకొంది. అలా చేసుకోవడమే కరుణ జీవితం చిన్నతనంలోనే మోడు వారిపోవడానికి కారణం అయిందేమో అనే అపరాధ భావం ఇపుడు అనసూయమ్మగారిలో ప్రవేశించింది. జీవితంలో ఎన్నో ఆటుపోటులు చూసిన ఆవిడ తన అంతరంగాన్ని ఎక్కడా బయట పెట్టలేదు. కానీ ఈసారి మాత్రం కొడుకు విషయంలో చేసిన తప్పు కోడలి విషయంలో చేయదలుచుకోలేదు. కోడలిని తన తర్వాత వ్యవహారాలు చూసుకోగల దక్షురాలిగా తీర్చిదిద్దాలనుకొంది. దీనికి కరుణను ముందుగా




ఈలోకంలో పడెయ్యాలి. మామూలుగానే ఆచితూచి మాట్లాడే కరుణ పెళ్ళయిన తర్వాత సగం మూగదయితే, భర్తపోయిన తర్వాత పూర్తిగా మూగదయింది. అనసూయమ్మగారు కోడలిని చదువుకోమని ప్రోత్సహించింది. కరుణకు పుస్తకాంటే ఇష్టమని ఆమెకు తెలుసు. ఆవిడ కొడుకు బతికుండగా పరిస్థితి వేరు. అతను ఇంట్లో ఆడవాళ్లు పుస్తకాలు పట్టుకుని కనబడితే ఊరుకునేవాడు కాదు. అతనిదో కాంప్లెక్సు. అతనికర్థంకాని పుస్తకాలు, అబ్బిరాని చదువు ఎవరికైనా ఉపయోగపడుతుంటే సహించలేక పోయేవాడు. ఆ విధంగా అతను బతికున్నన్ని రోజులూ కరుణ తాను చదువుకున్న దాన్నన్న విషయం దాదాపుగా మర్చిపోయింది. అత్తగారి ప్రోత్సాహంతో మళ్లీ పుస్తకాల వైపు దృష్టి మళ్ళించిన కరుణ వాళ్ల ఊరి లైబ్రరీ నుండి పత్రికలూ, నవలలూ తెప్పించుకు చదవసాగింది. దీనితో ఆమెకు కొంత చైతన్యం కలిగి ఇంటి విషయాలపై ఆసక్తి కనవరచడమే కాక ఇప్పుడిప్పుడే కరెస్పాండెన్సు కోర్సు డిగ్రీ చదవాలనే నిర్ణయానికి కూడా వచ్చింది. ఈ నేపథ్యంలో తన అత్తగారితో కలిసి పుట్టింటికి చుట్టం చూపుగా వచ్చింది కరుణ.

లౌకిక వ్యవహారాలలో దిట్ట సూర్యం అత్తా ఆడపడుచులకు ఘనంగా మర్యాదలు చేసి నాలుగు రోజులుండమని బతిమాలేడు. వాళ్లతో మంచిగా ఉండటం తనకెంతో లాభదాయకమనీ, వాళ్ల ఆస్తిపాస్తులు తన సంతానానికే దక్కే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని సూర్యానికి తెలుసు. అదే విషయాన్ని వాళ్లావిడకు కూడా వివరించి అట్నుంచి కూడా సమస్య లేకుండా చేసుకొన్నాడు. సూర్యం దంపతులు బలవంతం చేయడంతో కరుణకు పుట్టింట్లో కొంతకాలం పాటు ఉండక తప్పింది కాదు. అనసూయమ్మగారు మాత్రం రెండ్రోజులుండి తనకవతల పనులున్నాయంటూ వెళ్లిపోయారు.

మామూలుగా అయితే ఒకే ఇంట్లో ఉంటున్నా కరుణ, సుందరాలకు మాట్లాడుకునే అవసరం కానీ, అవకాశం కానీ ఉండేవి కావు. కరుణకు కొత్తగా పుస్తకాలపై కలిగిన ఆసక్తి ఆమెను చైతన్యవంతం చేసిన సంగతి, ఆమె గ్రాడ్యుయేషన్ చేద్దామనుకొంటున్న విషయమూ అనసూయమ్మగారు సూర్యానికి చెప్పింది. ఏ కళనున్నాడో సూర్యం చెల్లెల్ని ప్రోత్సహించాడు. దానితో 'కొంచెం ఆ అప్లికేషన్లు, ఫీజులు వివరాలు నువ్వే చూడరా మేము ఆ పల్లెటూరికి పోతే అడవికి పోయినట్లే!' అని సూర్యానికి పురమాయించింది అనసూయమ్మగారు. వెంటనే సూర్యం 'అదంతా సుందరానికి బాగా తెల్సులేవే అతను చూసి పెడతాడు' కరుణతో అని ఆ పనికాస్తా సుందరానికి బదలాయించాడు. 'ఆ పరీక్షకి ఏయే సబ్జెక్టులు ఎన్ని మార్కులకుంటాయో ఏం చదవాలో, ఎలా చదవాలో కూడా చెప్పించుకో. మిగిలిన విషయాలు ఎలా ఉన్నా మా సుందరం ఆ విషయాలలో ఎక్స్‌పర్టులే' అని కూడా ముదలకించాడు.




కూతురు : నేను రాజును ప్రేమించటం తప్పు కాదు. అతనికి రెండు అంతస్తుల బిల్డింగ్ ఉంది. కారు ఉంది. పొలం కూడా ఉంది నాన్నా!

తండ్రి : కానీ అవన్నీ తాకట్టులో ఉన్నాయని తెలుసుకోకపోవటం నీవు చేసిన తప్పు.

పి.ఎం. సుందరరావు
(విజయవాడ)

అప్పటికే సుందరం ప్రవర్తన, కలుపుకోరుతనం గమనించిన కరుణ పెద్దగా సంకోచపడకుండానే సుందరం వద్దకు వెళ్లగలిగింది. ప్రస్తుతం పూర్వపు చదువు పూర్తిగా మర్చిపోయి ఉండటంతో గ్రాడ్యుయేషన్ చేసే విషయంలో కరుణ కొంత అయోమయంలో ఉంది. 'అసలు నేను మళ్లీ పుస్తకాలు చదివి పరీక్షలు రాయగలనా' అని కూడా భయపడుతోంది కరుణ. ఆమె మానసిక పరిస్థితిని సరిగ్గానే అంచనా వేసిన సుందరం ఆమెకు కేవలం చదువుకు సంబంధించిన సలహాలివ్వడంతో సరిపెట్టక మామూలు కబుర్లు చాలా చెప్పాడు. ఆ సందర్భంలోనే ఒకరి వ్యక్తిత్వం మరొకరిని పరస్పరం ఆకర్షించడం జరిగింది. సాధారణంగా సుందరం, కరుణలు సూర్యం పిల్లలు ట్యూషన్‌లో ఉన్నప్పుడే ఈ విషయాలన్నీ మాట్లాడుకొనేవారు. వాళ్లిద్దరూ ఏకాంతంగా ఉండటం జరగలేదు కనుక సూర్యం దంపతులకు వారి ప్రవర్తనపై ఏమీ అనుమానం రాలేదు.

ఏం జరిగిందో ఎలా జరిగిందో తెలియదు కానీ ఒక రోజు ఉదయం సూర్యం నిద్రలేచేసరికి వాళ్లావిడ సుందరం, కరుణలిద్దరూ కనబడటం లేదని చెప్పింది. ఇద్దరూ కనబడటం లేదనీ, ఇద్దరి అదృశ్యానికి మధ్య సంబంధం ఉండి ఉంటుందని తోచేసరికి కొంత సమయం గడచిపోయింది. సూర్యం ముందుగా ఈ విషయం బయటికి పొక్కకుండా జాగ్రత్తలు తీసుకున్నాడు. చుట్టు ప్రక్కల ప్రేమ వివాహాలకు ప్రసిద్ధి గాంచిన గుళ్లూ, గోపురాలు వెతికాడు. కొద్దిగా దూరంగా ఉన్న వాటికి అత్యంత ఆప్తులను పంపాడు. అర్జెంటుగా అనసూయమ్మత్తకు విషయం వివరించి తదుపరి కర్తవ్యం నిర్ణయించేందుకు వాళ్ల ఊరు బయలుదేరాడు.

"తదుపరి కర్తవ్యం ఏమిటి? వాళ్లిద్దరూ ఏ ధైర్యంతో ఈ పని చేశారు? వాళ్లను ఈ పనికి ప్రోత్సహించినదెవరు?" ఇలాంటి సమాధానం లేని ప్రశ్నలు సముద్రంలోని తరంగాల్లా ముంచెత్తుతుండగా సూర్యం తన బస్సు ప్రయాణం పూర్తి చేసి అనసూయమ్మగారి ఊరైన రామాపురం చేరుకొన్నాడు.

☆ ☆ ☆

సూర్యం రామాపురం చేరుకొనేసరికి ఊళ్లో చీకట్లు అప్పుడప్పుడే ముసురుకొంటున్నాయి. కరెంటు కోత వలన కాబోలు ఎక్కడా విద్యుద్దీపాలు వెలగడం లేదు. అక్కడొకటి అక్కడొకటి కిరసనాయిల్ దీపాలు తప్ప. బస్సు దిగి ఇంటివైపు నడుస్తున్న సూర్యాన్ని ఆ చీకట్లోనే చాకలి రంగడు గుర్తుపట్టేడు. "ఏంటి సూర్యం బాబూ ఈవేళప్పుడు వస్తున్నావ్? పొద్దున్నేగా చిన్నమ్మ వచ్చింది!"

"ఏమిటీ కరుణ ఇక్కడకు వచ్చిందా?" సూర్యం కాసేపు స్తబ్దుడయ్యాడు. రంగడి ప్రశ్నకు జవాబు చెప్పకుండానే ముందుకు సాగిపోయాడు.

సూర్యం ఇంటికి చేరుకొనేసరికి ఇల్లంతా చీకటిగా ఉంది. ఇంటిలోపల హాల్లో గుడ్డి దీపం మినుకు మినుకుమంటోంది. అనసూయమ్మగారు ఇంటి వసారా స్తంభానికి చేరబడి రుక్మిణీ కల్యాణం పద్యాలు కూనిరాగం తీస్తున్నారు. చీకట్లో ఇంటివైపు వస్తున్న ఆకారాన్ని చూసి 'ఎవరదీ?' అన్నారు. 'నేనే!' సూర్యం జవాబు.

"ఎవరూ సూర్యమేనా?"

"ఆఁ!" అంటూ తొట్టిదగ్గరకు వెళ్లి కాళ్లు కడుక్కువచ్చి ఆవిడ దగ్గర కూలబడ్డాడు.

"కరుణ వచ్చిందా?" సూర్యం గొంతు అనేక భావాలను కలుపుకొని చివరికి భావరహితం అయింది.

"వచ్చిందిలే, ఉండు మంచినీళ్లు తెస్తాను." లోపలికెళ్లింది అనసూయమ్మగారు.

మంచినీళ్లు సూర్యానికి అందిస్తూ "నువ్వేమీ కంగారు పడకు. అంతా సవ్యంగానే జరిగింది. జరుగుతుంది." అన్నారు సూర్యం ఎదురుగా కూర్చొంటూ. పూర్తిగా అయోమయంలో పడిన సూర్యం భావాలను పట్టించుకోకుండా అనసూయమ్మగారు చెప్పడం ప్రారంభించారు.

"చూడు సూర్యం! మీరిద్దరూ చిన్నతనం నుండీ మా ఇంట్లో పిల్లల్లానే పెరిగారు. మొదట నుండీ ఆడపిల్ల కావడం చేతనూ, నాకు కూతుళ్లు లేకపోవడం వల్లనూ కరుణకు మా ఇంట్లో ఎప్పుడూ ప్రత్యేక స్థానం ఉంది. దానికి తోడు అది నా పోలిక అని మీరందరూ పదిసార్లు అనడం వల్ల కూడా అది నాకు దగ్గరయింది. అందుకనే దాన్ని వేరే ఇంటికి పంపటం ఇష్టం లేక నా కోడలిగా చేసుకొన్నాను. కానీ మీరందరూ అన్నట్టే దానికి జీవితంలో కూడా నా పోలికే వచ్చింది. నిక్షేపంలా ఉండవలసినది కాస్తా పసుపు కుంకాలకు నోచుకోకుండా పోయింది. ఆ రోజు నుండీ నాకు మనస్థిమితం లేదు. కళ్లెదురుగా అది అలా మోడులా ఉంటే చూడలేకపోయాను. దాని బతుక్కోదారి ఏర్పరచమని నేను దేవుణ్ణి ప్రార్థించన రోజు లేదు.

"అది మంచిది కాబట్టి మారుమాటాడకుండా పడి ఉంటోంది కానీ, ఒరే! అది ఈ పల్లెటూరి వాతావరణలో ఇమడలేదురా. రోజుకోలా తయారౌతున్న ఈ మోటు మనస్తత్వాలు, అనుభవం కలవాళ్లనే అయోమయపరుస్తున్న వ్యవసాయాలు, కమతాలు, ఎందుకురా దాని నెత్తిన కూడా రుద్దడం? నేను బావుకున్నది చాలదూ? అందుకనే దాన్ని ఆ డిగ్రీ కాస్తా పూర్తి చేయించి ఏదైనా దానికిష్టమైన పనిలో పెడదామనుకొన్నాను. ఇంకా దానికివేమీ పూర్తిగా చెప్పనే లేదు. చదువుకోమన్నానంతే. 'ఎంత ముందు చూపుతో ఉన్నానను' కొన్నా పల్లెటూర్లి దాన్ని కదా నా ఆలోచనలు అంతకన్నా ముందుకు సాగలా.

"అయితే దేవుడు నా మొరని వేరే రకంగా ఆలకించాడు. దానికివాళ మళ్లీ మనిషయ్యే అవకాశం అదృష్టం కలసి వచ్చాయి. ఆ అబ్బాయి సుందరం దాన్ని పెళ్లి చేసుకొంటానని అడిగాడట. కులవంతుడూ, గుణవంతుడూ అయినవాడు కోరి వచ్చినా అది మన పిల్ల కనుక మన్నడిగి, మనకిష్టమైతేనే ఏదైనా అందిట. నువ్వుసలే తిక్క మనిషివి కదా నాదాకా రానిస్తావో లేదోనని వాళ్లే చెప్పాపెట్టకుండా నా దగ్గరికొచ్చారు. నాకూ కాస్త మనుసు లాగిందీ, కోపం వచ్చిందీ అనుకో. కాని వాళ్ల స్వచ్ఛమైన మొహాలు చూసి కాదనలేకపోయా. మన పరువులూ ప్రతిష్ఠలు గురించి వాళ్ల జీవితాలు నాశనం చెయ్యలేముగా.

"ఇకపోతే ఆస్తిపాస్తులంటావా. నీ పిల్లలకీ, దాని పిల్లలకీ పెద్దయిన తర్వాత చెందేట్టు రాసుకుంటే సరి. ఆ అబ్బాయి అయితే ఆస్తి ఊసే ఎత్తొద్దన్నాడనుకో. అతని సంగతి నాకన్నా నీకే ఎక్కువ తెలుసు కదా! నువ్వు నా మాట తీసెయ్యవనే నమ్మకంతో నేను వాళ్లిద్దరినీ ఒకటి కమ్మని ఆశీర్వదించాను. ఏమిటీ మాట్లాడవ్? మరి వాళ్లను పిలవమంటావా?"

మంత్రముగ్ధుడై వింటున్న సూర్యం ఉలిక్కిపడి "నీకన్నా నాకెక్కువ తెలుసా అత్తయ్యా అలాగే కానీ" అన్నాడు. 'అబ్బాయ్ సుందరం! ఇట్రండయ్యా!" లోపలికి చూస్తూ కేక పెట్టింది అనసూయమ్మగారు. కరుణ చేతిని తన చేతిలోకి తీసుకొని వసారాలోకి అడుగుపెట్టాడు. సుందరం ఇంతలో కరెంటొచ్చింది. దీపాలు వెలిగాయి. ఇల్లంతా వెలుతురు పరచుకొంది వాళ్ల జీవితాల్లో పరుచుకున్న చైతన్యం లాగే.

☆




"ఏమండీ... పక్కింటి జామ చెట్టును చూస్తుంటే నాకూ జామకాయలు తినాలని ఆశ కలుగుతోంది. తెచ్చి పెట్టరూ...!"

"కాస్త చీకటిపడనీ... మరీ పగలే వెళ్లి కోస్తే వాళ్లు చూడరూ!" అన్నాడా పిసినారి భర్త.

"....!!"

**- అండే అనిత**
(చిత్తూరు)

